



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 14-06-2024 సంపుటి : 06 సంచిక : 271 పేజీలు : 8 వెల : రూ 3-00


## రాగల 24 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు..!





హైదరాబాద్ ,జూన్ 13 : రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో మరో మూడురోజులు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 5న మహబూ బ్నగర్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన రుతుపవనాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయని వెల్లడించింది.రాగల 24 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినట్లు తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్న గర్,నా గర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులలాంబ గద్వాల జిల్లాల్లో గురువారం, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి–భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శుక్రవారం వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

# తిరుమల నుంచి పాలనా ప్రక్షాళన



తిరుమలను ఐదేళ్లలో భ్రష్టు పట్టించారు
ఎపిని నంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతా
తెలుగు రాష్ట్రాలకు పెద్దన్నగా ఉంటా
ఇరు రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తా
సంపదను సృష్టించి పేదలకు పంచడమే లక్ష్యం
శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న సిఎం చంద్రబాబు





తిరుమల,జూన్ 13 టిటిడి నుంచే పాలనా ప్రక్షాళన చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శ్రీవారి సమక్షంలో చెబుతున్నా.. నేను 5కోట్ల ప్రజల మనిషిని. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ 5 ఏళ్ళు ఎంతో ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారని అన్నారు. రాష్ట్రంలో ఇకపై పరదాలు, నియంత్రణ వుండదు. నేటి నుంచి ప్రజా పాలన ప్రారంభం అయ్యింది. గత 5ఏళ్లలో జరిగిన నష్టం అపారం. రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది. 2047 నాటి భారత్ ప్రపంచంలోనే మొదటి రెండు స్థానాల్లోకి వస్తుంది. 2047 విజన్‌తో ముందుకు వెళ్తానిని ప్రకటించారు. ఏపీ దేశంలోనే నెంబర్ 1న రాష్ట్రంగా ఉండాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలి. తెలుగు రాష్ట్రాలకు పెద్దగా రెంటికీ మంచి జరిగేలా చూస్తానని అన్నారు. గురువారం ఉదయం చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీ వెంకటేశుని దర్శనం అనంతరం మీడియా తో మాట్లాడిన ఆయన.. శ్రీవారి ఆశీస్సుల కారణంగానే తమ కూటమి విజయం సాధించిందన్నారు. రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని.. 93 శాతం స్ట్రైక్ రేట్ గతంలో ఎప్పుడూ రాలేదన్నారు.తన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు.. కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులు హాజరయ్యా రన్నారు. తాను ఏ కార్యం చెయ్యాలన్నా ముందుగా తన కుల దైవమైన వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందుతానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. 2003లో స్వామి వారికి వస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సమయంలో నాపై క్లైమోర్ మైన్‌లతో దాడి చేశారు. ఆ దాడిని చూస్తే ఎవరు బ్రతకరు. కానీ శ్రీవారి ఆశీస్సులతో బయటపడ్డాను. దేవాన్ష్ పుట్టినరోజు నాడు శ్రీవారి అన్నదానానికి ప్రతి ఏటా విరాళం ఇస్తున్నాం. నేను ప్రతి రోజు గంటల తరబడి పూజలను చెయ్యను. ఒక్క నిమిషం మాత్రమే ధ్యానం చేస్తాను. శ్రీవారిని ఒక్కటే కోరుకుంటా. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. దేశం అభివృద్ధి చెందాలి. సంపదను సృష్టించి పేద ప్రజలకు పంచే అవకాశం ఇవ్వాలని కోరుకుంటానని అన్నారు. హైదరాబాద్‌ని 1.0 విజన్‌తో అభివృద్ధి చేశాను. అప్పుడు చేసిన అభివృద్ధిని చూసి ప్రపంచంలోని దేశాధినేతలు హైదరాబాద్‌కి వచ్చారు. భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. నేను జైలులో ఉన్నప్పుడు నన్ను ఆదుకున్నది కుటుంబ వ్యవస్థనే. తిరువళ్ళ శనివారాల్లో ఉపవాసం వుండి స్వామి వారికీ పూజలు చేస్తాం. స్వామి వారి దర్శనానికి వచ్చే వాళ్ళు మళ్ళీ మళ్ళీ వచ్చి స్వామి వారిని దర్శించుకుంటుంటారు. మన రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించే విధంగా ముందుకు వెళ్తాం.' అని చంద్రబాబు చెప్పారు. పేదరికంలేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తా. ఆర్థిక అసమానతలు లేని విదంగా చర్యలు చేపడుతాం. టీటీడీతోనే ప్రక్షాళన ప్రారంభం అవ్వాలి. నా పర్యటనలోనూ పరదాలు కడుతున్నారు. టీటీడీలో పెద్ద ఎత్తున్న అవకతవకలు జరిగాయి. జనాలనూ నా దగ్గరకు రానివ్వకుండా కర్ఫ్యూ వాతావరణం సృష్టించారు. నా కుటుంబానికి నేను ఏమి ఇవ్వాల్సిన అవసరం లేదు. 30 ఏళ్ల క్రితమే వాళ్ళకి వ్యాపారం పెట్టించా. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలని పిలుపునిచ్చా.. నా పిలుపు మేరకు ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. దురదృష్టం వల్ల అమరావతి, పోలవరం పడకేసింది. ఈ రెండింటిని అభివృద్ధి చెయ్యాలి. తిరుమల ఒక పవిత్రమైన దివ్య క్షేత్రం. తిరుమలని అపవిత్రం చెయ్యడం భావ్యం కాదు. వైకుంఠం ద్వారా స్వామి వారిని దర్శించుకోవడం మంచి అనుభూతిని ఇస్తుంది. తిరుమలని ప్రక్షాళన చేస్తా. దేశం గర్వపడేలా ప్రక్షాళన జరుగుతుందన్నారు. తిరుమలని దరిద్రపు ప్రాంతంగా తయారు చేశారు. గత ఐదేళ్లలో తిరుమలలో వీరు చెయ్యని అరాచకం లేదు. తిరుమల కొండపై అపచారం చేసిన వాళ్ళు ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తారు. మంచిని ప్రోత్సహిస్తా.. రౌడీయిజాన్ని అణచి వేస్తా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో తిరుమలలో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, ఔషధ మొక్కలను పెంచి అభివృద్ధి చేశామని అన్నారు. తిరుమలకు వస్తే ఆరోగ్యం పెరగాలి అన్నదే తన సంకల్పం అన్నారు.

## విమానయాన రంగాన్ని ఆధునీకరిస్తాం

పేదలకు అందుబాటులోకి విమాన సర్వీసులు తెస్తాం
కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ నాయుడు
నమ్మకంతో బాధ్యత అప్పగించిన మోడీ,చంద్రబాబులకు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ,జూన్ 13 ,: కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. దేశంలో అత్యంత పిన్న వయసులో కేంద్ర కేబినెట్ మంత్రి పదవి రామ్మోహన్ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీకాకుళం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు తనకు కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని నరేంద్ర మోదీ.. పౌర విమానయాన శాఖ అప్పగించారన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్ని శాఖలను మోదీ కోరారని మంత్రి చెప్పుకొచ్చారు. 'కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భగవంతుడు, మా నాన్న ఎర్రన్న నాయుడు ఆశీస్సులు నాకు ఉన్నాయి. బాధ్యత రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, శ్రీకాకుళం తెలుగు ప్రజలకు ధన్యవాదాలు. పౌర విమానయాన శాఖ కేటాయించిన మోదీకి కృతజ్ఞతలు. దేశంలో, ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి సాధిస్తున్న రంగం విమానయాన రంగం. యువతకు బాధ్యత ఇస్తే సమర్ధవంతంగా నిర్వహిస్తారని మోదీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. నా శాఖను సమర్ధవంతంగా నిర్వహిస్తాను. 100 రోజుల ప్రణాళిక తయారు చేస్తాం. 2047 నాటికి సివిల్ ఏవియేషన్‌లో ఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందిస్తాం అని వివరించారు. అలాగే సామాన్య ప్రయాణికుల కోసం ఈస్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతాం. పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తాం. భవిష్యత్తులో 100 శాతం పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని రామ్మోహన్ చెప్పారు. 'ఎయిర్ పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తాం. సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తాం. విమానయాన రంగానికి పునాదులు వేసిన వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఉడాన్ స్కిమ్ ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణం చేరువైంది. జ్యోతిరాదిత్య సింధియా సూచనలు తీసుకున్నాను. డీజీ యాత్రను విమానాశ్రయా లకు విస్తరిస్తాం. సివిల్ ఏవియేషన్ ఆఫ్ ఇండియా బెస్ట్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. మోదీ, చంద్రబాబు విజనరీ లీడర్స్. వారిద్దరి లిడర్ షిప్‌లో పౌర విమానయాన శాఖను ముందుకు తీసుకువెళతాను. భోగాపురం ఎయిర్ పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేసి విమానాలు ల్యాండ్ చేస్తాం. విజయవాడ, తిరుపతికి కనెక్టివిటీ పెంచుతాం. రాజమండ్రి, కడప,



కర్నూలు విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తానని వివరించారు. ఏవియేషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్‌ను ఏపీ నుంచి ప్రారంభిస్తాను. ఏపీ, తెలంగాణ సహా రాష్ట్రాల వారిగా విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తాం. విజయవాడ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేస్తాం. విజయవాడ ఎయిర్ పోర్టు కనెక్టివిటీ పెంచుతాం' అని కేంద్ర మంత్రి రామ్మోహన్ వెల్లడించారు.

## కాశ్మీర్‌లో ఉగ్రదాడులపై కేంద్రం సీరియస్

భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ సమీక్ష
ఉగ్రమూకలను ఏరేయాలని ఆదేశం



న్యూఢిల్లీ,జూన్13 : జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రదాడిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. అక్కడి భద్రతపై సమీక్ష జరిపారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని అధికారులకు సూచించారు. గత నాలుగు రోజులుగా జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడులు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులే ఈ దాడులకు తెగబడుతున్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొందరి ఊహా చిత్రాలనూ విడుదల చేశారు. ఈ క్రమంలోనే మోదీ అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ భేటీలో అజిత్ దోవల్ మోదీ అక్కడి స్థితిగతులూ పూర్తి స్థాయిలో వివరించారు. సాయుధ బలగాలు ఈ దాడులను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందో కూడా తెలిపారు. ఈ మేరకు మోదీ కొన్ని సూచనలు చేశారు. అవసరమైనతే భారీ మొత్తంలో సాయుధ బలగాలను మొహరించి ఉగ్రవాదుల్ని ఏరి వేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపైనే మోదీ అమిత్ షాతో కూడా మాట్లాడారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ ప్రధాని మోదీ మాట్లాడారు. స్థానిక అధికార యంత్రాంగం ఉగ్రదాడులను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతోందో అడిగి తెలుసుకున్నారు. దొడ జిల్లాలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఓ సైనికుడు గాయపడ్డాడు. దొడ జిల్లాలో ఇలా దాడి జరగడం రెండోసారి. నాలుగు రోజుల్లో నాలుగు సార్లు జమ్ముకశ్మీర్‌లో కాల్పుల మోత మోగింది. జూన్ 9వ తేదీన రేసీ జిల్లాలో ఓ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో 9 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరవాత భద్రతా బలగాలు ఉగ్రవేట మొదలు పెట్టాయి. కథువా జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. దొడలో ఎత్తైన పర్వతాల్లో నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నారు.
అక్కడి వరకూ వెళ్లి వాళ్లను మట్టుబెట్టడం సవాల్‌గా మారుతోంది. చత్తర్‌గల్లా వద్ద వాళ్ల కోసం గాలిస్తుండగా ఉన్నట్టుండి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు ఉగ్రవాదులు. ఈ ఘటనలో రాష్ట్రీయ రైఫిల్స్‌కి చెందిన ఐదుగురు సైనికులతో పాటు ఓ సీనియర్ పోలీస్ అధికారి గాయపడ్డారు.

# సంపాదకీయం

శుక్రవారం 14-06-2024

## ముందున్న సవాళ్లు అధిగమించేది ఎలా

303 సీట్లతో సొంతంగా మెజార్టీ ఉన్నప్పుడే..బీజేపీ సునాయాసంగా నిర్దేశిత లక్ష్యం 370 సీట్లు సాధించగలదన్న అంచనాలు వెలువడుతున్నప్పుడే?.మోదీ మరో కోణాన్ని ఆలోచించారు. అన్నీ ఉన్నాయన్న, వస్తాయన్న అతిశయానికి పోకుండా ఆచితూచి అడుగులు వేశారు. రాజకీయాల్లో మనం బలంగా ఉ ఒడడం ఎంత ముఖ్యమో?ప్రత్యర్థి బలహీనంగా ఉండడమూ, ఉంచడమూ అంతే ప్రధానమన్న సూత్రాన్ని ఒంటబట్టించుకుని వ్యూహాలు ఫలితంగా మూడోసారి దేశప్రధాని అయ్యారు. రచించారు. మూడో విడత ఢిల్లీ పీఠాన్ని అధిరోహించేక్రమంలో మోదీ ఒక్కో ఇటుకా పేర్చిన తీరు?..తలపండిన రాజకీయ విశ్లేషకుల అంచనాలను సైతం తలకిందులు చేసింది.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశానికి మూడోసారి ప్రధాని అవ్వడానికి ఏకైక కారణం మోదీనే. దేశ ప్రధానిగా సాధించిన విజయాలే కాదు?అంచనాలకు అందని రీతిలో ఆయన వేసిన రాజకీయ అడుగులే?..ఆయన సరికొత్త చరిత్ర సృష్టించడానికి కారణమయ్యాయి. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టింది మోదీనే. కానీ నెహ్రూ కాలంతో పోలిస్తే..ఇప్పటికి రాజకీయ వాతావరణం పూర్తి భిన్నం. నెహ్రూ, మోదీ సామాజిక నేపథ్యాలు, రాజకీయ అడుగులు కూడా భిన్నమైనవే. నెహ్రూ సంపన్న కుటుంబానికి చెందిన వారు.దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం ఘనత మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్‌ఖాతాలో పడింది. ప్రతిపక్షం బలహీనంగా ఉంది. గాంధీజీ మరణం తర్వాత నెహ్రూ భారత రాజకీయ ముఖచిత్రంగా మారారు. అప్పటికి దేశంలో పార్టీ అంటే కాంగ్రెస్సే?రాజకీయ నేత అంటే కాంగ్రెస్ నాయకుడే. అలా పరిస్థితులన్నీ పూర్తిసానుకూలంగా ఉన్నప్పుడు నెహ్రూ వరుసగా ప్రధానిగా ఉన్నారు.కానీ మోదీ అలా కాదు. ఆయన ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చారు. చాయ్‌వాలాగా గుర్తింపు పొందారు. కూటమిగా అయినా ప్రతిపక్షం బలంగానే ఉంది. సంకీర్ణ రాజకీయాల కాలం నడుస్తోంది. అనేక రాష్ట్రాల్లో జాతీయపార్టీలు నామమాత్రమై?ప్రాంతీయపార్టీల హవా పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ దేశప్రధానిగా మూడోసారి ఎన్నికవ్వడం భారతదేశ చరిత్రలోనే కాదు..ఆధునిక ప్రపంచంలోనూ అతిపెద్ద విప్లవం.బీజేపీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని హెచ్చరిస్తూ కాంగ్రెస్ సహా ఇతర పక్షాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. రిజర్వేషన్ల అమలుపై ఎన్నడూ లేనిస్థాయిలో చర్చ జరిగింది. అసలు మోదీ మరోసారి ప్రధాని అయితే..దేశంలో జరిగే చివరి ఎన్నికలు ఇవేననీ ప్రతిపక్షాలు జోస్యం చెప్పాయి.మరి ఇలాంటి విపరీత ప్రచారాన్ని సైతం దాటుకుని కొన్ని రాష్ట్రాలను బీజేపీ క్లీన్‌స్వీప్ ఎలా చేయగలిగింది..? జాతీయ స్థాయిలో వరుసగా రెండు సార్లు అధికారంలో ఉండి కూడా..కరోనా కల్లోలాన్ని తట్టుకుని కూడా బీజేపీ 240 సీట్లు ఎలా సాధించగలిగింది..? మోదీ గ్యారెంటీపై ప్రజలకు నమ్మకం కలగడానికి కారణమేంటి..? మోదీని ఇండియా ముఖచిత్రంగా ప్రపంచదేశాలు ఎందుకు చూస్తున్నాయి..?పదేళ్ళు (2004-2014 మధ్య) అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమిపై అవినీతి, శాంతిభద్రతల నిర్వీర్యం వంటి ఆరోపణలతో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఆ భారీ వ్యతిరేకత తర్వాత అధికారంలోకి రావడం, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ ఉండడంతో 2014-2019 మధ్య మోదీ ప్రభుత్వ పాలన నల్లేరు మీద నడకలా సాగిపోయింది. 2019-2024 మధ్య మాత్రం భారీ మెజార్టీ ఉన్నప్పటికీ ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి.ఆర్టికల్ 370 ఎత్తివేత, ట్రిబుల్ తలాక్ రద్దు వంటివి సాఫీగానే సాగినా?వ్యవసాయ చట్టాల అమలు, అంం, కామన్ సివిల్ కోడ్ వంటి అమలు అనుకున్నంత తేలిగ్గా సాధ్యం కాలేదు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. అంం అమలును వాయిదా వేయాల్సివచ్చింది. కామన్ సివిల్ కోడ్ ఎన్నికలముందు మాత్రమే తెరపైకి వచ్చింది. వీటన్నింటికి తోడు కరోనా రూపంలో అసలైన సవాల్ ఎదురయింది. సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాల్సివచ్చింది. కరోనాతో ఆర్థికాభివృద్ధిపై పెను ప్రభావం పడింది. ధరలు అదుపుతప్పాయి. రష్యా, యుక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జా తీయ పరిణామాలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపాయి. అయితే ఈ సవాళ్లన్నింటినీ ప్రధాని మోదీ చాకచ క్యంగా అధిగమించారు. సమయానుకూల నిర్ణయాలతో దేశం సంక్షోభం బారినపడకుండా నివారించారు. పొరుగుదేశాలు శ్రీలంక, పాకిస్థాన్‌కు ఎదురయిన దుస్థితి భారత్‌కు రాకుండా అడ్డుకున్నారు. మొదటిదఫాలో చేపట్టిన మేకిన్ ఇండియా వంటి ఫలితాలు ప్రభావం చూపాయి.మరోపక్క విదేశాంగవిధానంతో అంతర్జాతీయంగా భారత్‌ను బలీయంగా మార్చారు. పాకిస్థాన్ సైతం భారత్‌ను ప్రశంసించేస్థితిలోకి తీసుకెళ్లారు. సంస్కరణలున వేగవంతం చేసి సంపద సృష్టించారు. విశాలమైన రహదారుల నిర్మాణం, వందేభారత్ రైళ్లు, డిజిటల్ లావాదేవీలు, పారిశ్రామకరంగాలకు ప్రోత్సాహం వంటివాటితో ప్రజల జీవనవిధానంపై ప్రభావం చూపారు. ఫలితంగా కొత్త ఇండియా ఆవిర్భావానికి బాటలు వేశారు.అయితే పదేళ్లు వరుసగా అధికారంలో ఉండడంతో పాటు మతానికి ప్రాధాన్యత పెరిగిందన్న ఆరోపణలు, సంపద అందరికీ సమానంగా పంపిణీ కావడం లేదన్న విమర్శలు, ధరల పెరుగుదల, ప్రభుత్వరంగంలో ఉద్యోగాల కొరత, రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడ్డ ప్రభుత్వాల్లో జోక్యం చేసుకోవడం, అదేపనిగా జరిగిన సీబీఐ, ఐటీ దాడులు వంటివి ..బీజేపీపై ఊహించిన దానికన్నా వ్యతిరేకత ను పెంచాయి.అవినీతి ఆరోపణలు ఉన్నవారిని పార్టీలో చేర్చుకోవ డం, పాలన ఒకే చోట కేంద్రీకృతమయిందన్న భావన వంటివి విమర్శకులకు పని కల్పించాయి.కురుక్షేత్రంలో దిగినప్పటికీ.. ఈ పరిస్థితులన్నింటినీ గమనించిన ప్రధాని మోదీ పొత్తుల విషయం లో ఎవరికీ అందని ఎత్తులు వేశారు. ఆయన వ్యూహాలతో ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా ఎన్డీఏ కూటమిని బలపడడం తో పాటు ఇండియా కూటమి బలహీనపడి?మూడోసారి మోదీ దేశప్రధాని అయ్యేందుకు మార్గాన్ని సుగమం చేసింది.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు.



### - పంచాయతీ రాజ్ & శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ములుగు :ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని ప్రతి పేదవారికి ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో పంచాయితీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి 2024-25 విద్య సంవత్సరంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన జరుగుతుందని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు,పాఠ్య పుస్తకాలు,ఉచిత భోజనం , ప్రభుత్వ వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు ఉచిత వసతి తో పాటు కాస్మెటిక్స్ ఇతర సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యా రంగాలకు పెద్దపీట వేసిందని విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలలో తల్లిదండ్రులు వారి పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటారని ప్రభుత్వ పాఠశాలలలో వారి ఉజ్వలమైన భవిష్యత్తుకు మొదటి అడుగు పడుతుందని విద్యార్దులు వారి తల్లి తండ్రుల ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేయాలని అన్నారు.నేటి బాలలే రేపటి పౌరులని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే గొప్ప విజయాలు సాదిస్తున్నారని , మహనీయుల జీవిత చరిత్ర , వారు చేసిన కృషి ,సాధించిన విజయాలు విద్యార్దులకు పాఠ్య అంశాలుగా బోధించాలని మంత్రి సూచించారు.గ్రామాలలో ఉండే ప్రాథమిక పాఠశాలలలో అగన్వాడి కేంద్రలలోని చిన్నారులకు ఈ విద్య సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియం నర్సరీ విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని , విద్య ద్వారా వచ్చే విజ్ఞానాన్ని ఎవరు దోచుకోలేరని, విజ్ఞానం తరగని నిధి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్య అర్హతలు కలిగిన ఉపాధ్యాలు విద్యార్దులకు అందుబాటులో ఉన్నారని ,పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాటశాలల్లో అత్యధిక విద్యార్థుల నమోదు కొరకు జూన్ 6 నుండి 19 వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని ఆవె సూచించారు.2024-25 విద్య సంవత్సరంలో జిల్లాలో చదివే 19,645 మంది పిల్లలకు ఒక జత ఉచిత ఏక రూప దుస్తులను మహిళ సంఘాల ద్వారా కుట్టించడం జరిగిందని వాటికోసం ప్రభుత్వం ఒక జత కు 75 రూపాయలు చెల్లించడం జరుగుతుందని జిల్లాలో మొత్తంఈ విద్య సంవత్సరంలో 1,71,150 ఉచిత పాఠ్య పుస్తకాలకు గాను 1,42,510 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 95,913 ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పించడం కోసం జిల్లా లోని ప్రభుత్వ, లోకల్ బాడీ, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల, గురుకులలో 367 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ లను నూతనంగా నియమించి మౌలిక వసతుల కల్పన కొరకు సుమారు రూ. 6.91 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఐటీడీఏ పరిధిలోని 99 ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇట్టి పనులను చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా నేటి వరకు 256 పాఠశాలల్లో ఎంపిక చేసిన అన్ని రకాల పనులు పూర్తి చేస్తున్నాం అని పాఠశాలలో 95% పనులు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ విద్య సంవత్సరంలో పాఠశాలలకు 6268 డ్యుయల్ డెస్క్ లు, 449 గ్రీన్ చాక్ బోర్డు లు అందించడం జరుగుతుందని తెలిపారు.విద్యార్ధులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి లక్ష్య సాధనకు కృషి చేసి తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా విద్యను అభ్యసించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ములుగు ఎంపీపీ గండ్ర కోట శ్రీదేవి,డి ఈ ఓ పాణిని, డీఎస్పీ రవీందర్,మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి, ఎం ఈ ఓ లు, విద్యార్థిన, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ స్కామ్‌పై నిర్లక్ష్యం..విదేశీ పర్యటనలతో బిజీ : మోదీ తీరుపై కాంగ్రెస్ ఫైర్

నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ విషయంలో విచారణ జరిపించాలనే డిమాండ్‌పై బీజేపీ తీరు అత్యంత బాధ్యతారహితంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ అన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. నీట్ ప్రశ్నాపత్నం లీకేజ్‌తో దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు.శిక్షణ నిమిత్తం కోచింగ్ సెంటర్లలో సాధారణ కుటుంబాలు సైతం లక్షలు వెచ్చించి ప్రభుత్వ నిర్వాకంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారని అన్నారు. నీట్ స్కామ్‌పై దృష్టిసారించాల్సిన ప్రధాని మోదీ ప్రమాణ స్వీకార వేడుకలకు, విదేశాలకు వెళుతూ బిజీగా గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ విద్యార్థుల గోడును విపక్ష ఇండియా కూటమి తన బాధ్యతగా లేవనెత్తుతోందని చెప్పారు.ఇండియా కూటమి బలంతో ఇప్పుడు ప్రభుత్వ మెడలు వంచి విద్యార్థులకు న్యాయం చేసేలా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే జూన్ 4నే నీట్ రిజల్ట్స్‌ను ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిందని, వీటి ఫలితాలపై ఎవరూ చర్చించే అవకాశం లేకుండా ఉంటుందనే ప్రభుత్వం జూన్ 4న నీట్ రిజల్ట్స్‌ను ప్రకటించిందని దుయ్యబట్టారు.




# పింఛన్ పెంపు ఏమయే

### 100 రోజుల్లోనే ఇస్తామని 6నెలలైనా ఊసెత్తని కాంగ్రెస్..?

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు

హైదరాబాద్,రెండువేల రూపాయలు ఉన్న పింఛన్‌ను నాలుగువేలకు పెంచి ఇస్తాం. అని ఆశపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు, అమలుపై ఎలాంటి శ్రద్ధ పెట్టినట్టు కనిపించడం లేదు.44 లక్షల మందికిపైగా లబ్ధిదారులు దివ్యాంగులు దాదాపు 5 లక్షల మంది, రెండువేల రూపాయలు ఉన్న పింఛన్‌ను నాలుగువేలకు పెంచి ఇస్తం. అని ఆశపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు, అమలుపై ఎలాంటి శ్రద్ధ పెట్టినట్టు కనిపించడం లేదు.వందరోజుల్లోనే హామీని అమలు చేస్తామని చెప్పి ఆరు నెలలు గడుస్తున్నా ఊసెత్తడం లేదు. ఎప్పుడెప్పుడు పెరిగిన పింఛను అందుకుందామా.? అని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తుంటే పాతపద్ధతిలోనే పైసలు వేసి చెయ్యిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలుస్తున్నది.ఆరు గ్యారెంటీల్లో భాగంగా 2 వేల పింఛన్‌ను 4వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. 4 వేలు ఉన్న దివ్యాంగులపింఛన్‌ను 6వేలకు పెంచుతామని చెప్పింది.ఈ హామీలను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి ఇప్పటికి 180 రోజులైంది. రాష్ట్రంలో అన్నిరకాల పింఛన్ల లబ్ధిదారులు మొత్తం 44లక్షల మంది ఉన్నారు. వీరంతా పెరిగిన పింఛన్ ఎప్పుడు అందుతుందా.? అని ఎదురుచూస్తున్నారు. వీరిలో దాదాపుగా ఐదు లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. మిగతావారిలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత, గౌడ, హెచ్‌ఐవీ, బోధకాలు బాధితులు, డయాలసిస్ రోగులు ఉన్నారు.నిరాటంకంగా ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంసమాజంలో నిస్సహాయులుగా ఉన్న వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే మొదట పింఛన్‌ను వెయ్యికి పెంచి అందించింది. రెండో టర్మ్‌లో 2,000 కు పెంచింది. 2014 నవంబర్‌లో ఆసరా పెన్షన్ పథకాన్ని ప్రారంభించి కరోనా లాంటి కష్టకాలంలోనూ నిరాటంకంగా అందించింది. ప్రారంభంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, హెచ్‌ఐవీ బాధితులు,చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు పింఛన్లు అందజేసింది. 2015 మార్చి బీడీ కార్మికులకు, 2017 ఏప్రిల్ నుంచి ఒంటరి మహిళలకు, 2018 ఏప్రిల్‌ని ఫైలేరియా బాధితులకు, 2022 ఆగస్టు నుంచి డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లను వర్తింపజేసింది. త్వరలోనే పింఛన్ల చెల్లింపునకు సిద్ధమవున్న కాంగ్రెస్ ప్రభుత్వం,పాత విధానంలోనే వెళ్లేందుకు యోచిస్తున్నట్టు సమాచారం. 44లక్షల మంది లబ్ధిదారులకు పింఛను ఇవ్వాలంటే నెలకు సగటున వెయ్యి కోట్ల చొప్పున ఖర్చవుతుందని, ఇప్పుడా మొత్తాన్ని రెట్టింపు చేయడం వల్ల మరో వెయ్యి కోట్ల అదనపు భారంపడుతుందని అధికారులు అంచనా వేశారు. కొత్తగా అసరా పింఛను కోసం ప్రజాపాలనలో చేసిన దరఖాస్తులన్నీ అటకెక్కినట్టు తెలుస్తున్నది. ఉన్న పింఛన్లను పెంచి ఇవ్వడంపైనే దృష్టిపెట్టని ప్రభుత్వం, కొత్తవి ఎలా:జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు ఇస్తుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

### సిరిసిల్ల జాబ్ మేళాలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. పోలీసుల శాఖ ఆద్వర్యంలో నిర్వహణ హాజరైన కలెక్టర్ అనురాగ్ జయంతి-ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న జిల్లా,మెగా జాబ్ మేళాకు విశేష స్పందన, సుమారు 8000 మంది హాజరు.మెగా జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్.యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలనిప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పిలుపు నిచ్చారు. సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని కల్యాణి లక్ష్మి ఫంక్షన్ హాల్ లో గురువారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళకు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ సహకారంతో 60 కి పైగా కంపెనీలతో 1000 ఉద్యోగ అవకాశాలతో మెగా జాబ్ మేళ నిర్వహణకు కృషి చేసిన జిల్లా ఎస్పీ, పోలీస్ యంత్రాగాన్ని విప్ అభినందించారు.మెగా జాబ్ మేళాకు ముందుగా అన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న సుమారు 8000 మంది యువత పెద్ద సంఖ్యలో మేళాకు తరలిరాగా, ఆరువైకి పైగా వివిధ కంపెనీలకు చెందిన హెచ్. ఆర్‌లు వచ్చి యువతకు సంబంధించి విద్యార్హతలను బట్టి ఇంటర్యూలు నిర్వహించి సెలెక్ట్ అయినవారికీ తమ సంస్థల్లో పనిచేసేందుకు నియామక పత్రాలను అందించారు.డ్రగ్ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని,యువత ఉ ద్యోగ అవకాశాలనిఅందిపుచుకోవాలని,కష్టపడి పనిచేయాలనుకునే యువత కోసం ఉద్యోగ అవకాశాలు క్యూ కడుతాయని పేర్కొన్నారు. వారం రోజులపాటు పోలీస్ అధికారులు, సిబ్బంది నిరుద్యోగులకు అవగాహన సమావేశాలు నిర్వహించి, విజయవంతం చేశారని కొనియాడారు.శాంతి భద్రతలు కాకుండా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నం పోలీస్ వారు చేయడం అభినందనీయమని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షలఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే 30 వేల నియామకాలు చేశామని వెల్లడించారు. ఇటీవల గ్రూప్ - 1 పరీక్ష నిర్వహించామని, త్వరలో మెగా డీఎస్ సి చేపట్టనున్నామని, తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా యువతకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్ అందించి స్థానికంగా,ఇతర దేశాల్లో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంతున్నామనిపేర్కొన్నారు. దుబాయ్ ప్రతినిధులతో పిలిపించి, అక్కడ కంపెనిలకు ఉపయోగ పడేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని వివరించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడ్డుతు.యువత కోసం జాబ్ మేళ నిర్వహించిన ఎస్పీ, పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.యువత తమకు అందిన అవకాశాలను అందిబుచ్చు కోని తమకు అనుకూలంగా మార్చుకోని ఉద్యోగాల్లో రాణించాలని, కష్టపడి పనిచేయడం అనేది ఒక అలవాటుగా మార్చుకోవడంతో పాటు,ఏ ప్రాంతంలో అయిన పనిచేసేందుకు సిద్ధపడివుండాలన్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.యువతను సన్మార్గంలో నడిపించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.వెయ్యి కిలో మీటర్ల ప్రయాణం కూడా మొదటి అడుగుతోనే ప్రారంభం అవుతుందని, అలాగే యువత ఖాళీగా వుండకుండా తన విధ్యార్హతకు తగిన ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా, వచ్చిన ఉద్యోగంలో ప్రతిభ కనబర్చడం ద్వారా యువత అనుకున్న లక్ష్యాలను సాధించడం సులవుతుందని, వచ్చిన అవకాశాలను అందిబుచ్చుకోని ముందుకు సాగిపోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి,నాగేంద్రచారి, మురళి కృష్ణ, సిఐ లు రఘుపతి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్‌ఐ లు యాదగిరి,రమేష్, స్పెషల్ బ్రాంచ్ సిఐ అనిల్ కూమార్, సిబ్బంది, వివిధ కంపెనీల హెచ్. ఆర్ లు నిరుద్యోగ నివారణ ఫండేషన్ సిబ్బంది యువత పాల్గొన్నారు.

# అమరావతిలో భూముల ధరలకు రెక్కలు



విజయవాడ, జూన్ 13 (ఆంధ్రరేఖ. ప్రతినిధి), ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గత అయిదేళ్లుగా చతికిలపడిన భూముల రేట్లు కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో రాజధాని ఆశలతో తిరిగి పుంజుకున్నాయి. నిజం చెప్పాలంటే 2023 డిసెంబరు నెల నుంచే తిరిగి చంద్రబాబే ముఖ్యమంత్రి కానున్నారనే టాక్ రావడంతో నిర్జీవమైన భూముల ధరల్లో చలనం కనిపించింది. మూడు రాజధానుల అంశాన్ని గత ప్రభుత్వం తెరపైకి తేవడంతో.. ఏపీ రాజధాని అమరావతితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలు దాదాపు నాలుగేళ్లపాటు నేల చూపులు చూశాయి. ఇక్కడి రియల్ ఎస్టేట్ సంస్థలు దాదాపు మూతపడే పరిస్థితికొచ్చాయి. భూములు కొనుగోళ్ల పరిస్థితి అటుంచితే.. కనీసం అపార్ట్మెంట్లలో ఫ్లాట్లు వైపు సైతం చూసేవారు లేని పరిస్థితి నెలకొంది. కానీ కొన్ని నెలల నుంచి పరిస్థితిలో మార్పు కనిపించింది. వైసీపీ ప్రభుత్వంపై రాజధాని అమరావతి ప్రజల్లో కూడగట్టుకున్న వ్యతిరేకత సైతం కూటమికి ఓటు వేసేలా చేసింది. చంద్రబాబు చేతికి తిరిగి పగ్గాలొస్తాయన్న భావించి, చంద్రబాబు సీఎం అయితే అమరావతినే రాజధానిగా అభివృద్ధి చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ ప్రచారం ధరలు పెరిగేలా చేయడానికి కారణమైంది.గడిచిన ఆరు నెలల్లో అమరావతి రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలం తుళ్లూరు, వెలగపూడి, మందడం, రాయపూడి తదితర గ్రామాలు, మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు తదితర ప్రాంతాలు, తాడేపల్లి మండలం లోని పెనుమాక, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో మొన్నటి వరకు రూ. 3,500 నుంచి రూ.4,000 వరకు ఉన్న గజం భూమి ఏకంగా రూ.45 వేలకు చేరిపోయిందని ఇక్కడి రియల్టర్లు చెబుతున్నారు. ఇక్కడ ఎకరం భూమి కొనాలంటే 15 నుంచి 20 కోట్లు వెచ్చించాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. సమీపంలోని గుంటూరు, విజయవాడ వంటి నగరాల్లోనూ రియల్ వ్యాపారాలు పుంజుకున్నాయి. ఈ నెల ఒకటో తేదీ వరకు డబుల్ బెడ్రూం ఫ్లాట్లు రూ.40 లక్షల నుంచి 45 లక్షల మధ్య ఉండగా ఇప్పుడు 50 లక్షలు పైమాటే పలుకుతున్నాయంటున్నారు. నిర్మాణంలో ఉన్నవాటిని హాట్ కేకుల్లా అమ్ముతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎటు చూసినా రియల్టర్ల హడావుడి, ప్రాంతాన్ని బాగుచేస్తోన్న కార్మికుల గలగలతో సందడి వాతావరణం నెలకొంది. జూన్ 4న కూటమికి విజయాన్ని అందిస్తూ ఎన్నికల ఫలితాలు రావడంతో.. అమరావతి ప్రాంత రైతులు, ప్రజల ఆశలు, కలలు నిజమయ్యాయి. దాదాపు 1600 రో?జులకు పైగా సుదీర్ఘంగా సాగిన అమరావతి రాజధాని ఉద్యమానికి తెరపడినట్లయింది. సరికొత్త ఆశలతో రాజధాని ప్రాంతమంతా ఊపిరి తీసుకుంది. అమరావతి ప్రాంతంలో కూటమి గెలుపు దరిమిలా నేతల నుంచి సంకేతాలు వెళ్లడంతో అధికారులు బాగుచేత పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో తుప్పు బట్టిపోయిన పరికరాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. తుమ్మచెట్లు కొట్టేస్తూ రహదారులు సైతం నిర్మిస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నేపథ్యంలో రాజధాని అంశంపై ఆయన చేసే ప్రకటనలతో ఈ బూమ్ మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న ఇసుక విధానంతో నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో ముఖ్యంగా తొలివారంలోనే కూటమి ప్రభుత్వం ఇసుక విధానంపై సమీక్షించే అవకాశముందని భావిస్తున్నారు.తాజా పరిస్థితుల గతంలో రియల్ పెట్టుబడి పేరెత్తితే గతంలో హైదరాబాద్ వైపు చూసిన పెట్టుబడిదారులంతా ఇప్పుడు గుంటూరు, విజయవాడ పరిసరాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఎలా చూసుకున్నా రియల్ బూమ్ ఊహించని విధంగా ఊపందుకుంది. కేవలం రాజధాని ప్రాంతమే కాకుండా.. రాజధాని ప్రాంతమైన గుంటూరు, విజయవాడ ప్రాంతాలకే రియల్ బూమ్ పరిమితం కాకుండా అటు ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ఇటు ఉమ్మడి కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భూముల ధరలపై ప్రభావం పడే అవకాశముందని రియల్ రంగ నిపుణులంటున్నారు. ఇప్పటికిప్పుడు ఈ తేడా కనిపించకపోయినా రానున్న రెండు మూడు నెలల్లో ధరలు విపరీతంగా పెరుగుతాయని చెబుతున్నారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. మొన్నటి వరకూ రాత్రుళ్లు చీకటిగా ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డు ఇప్పుడు విద్యుత్తు వెలుగులతో తళతళలాడుతోంది. మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం నుంచి రాయపూడి వరకూ ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డు 9 కిలోమీటర్ల మేర విద్యుత్తు వెలుగులు పునరుద్ధరించేందుకు అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవడంతో సోమవారానికే సీడ్ యాక్సిస్ రోడ్డంతా విద్యుత్తు వెలుగులు సంతరించుకుంది.

## ఏపీలో నేడు స్కూళ్లు రీఓపెన్

విజయవాడ, (ఆంధ్రరేఖ. ప్రతినిధి)ఏపీలో వేసవి సెలవుల అనంతరం గురవారం నుంచి స్కూళ్ల పున:ప్రారంభం అయ్యాయి. వూసవి సెలవుల అనంతరం ఏపీలో నేడు పాఠశాలలు తెరు చుకున్నాయి. ఇక విద్యార్థులు, ఉపాధ్యాయులు నేటి నుంచి బడి బాటపట్టారు. ప్రతి ఏటా జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభ మవుతాయి. కానీ ఈ ఏడాది నూతన ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో అదనంగా ఓ రోజు సెలవు వచ్చింది. బడులు ప్రారంభమవుతున్న నేపథ్యంలోవిద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మొదటి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ప్రకాష్గతంలో చెప్పారు.

# ఏపీకి సూపర్ ఛాన్స్

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రరేఖ. ప్రతినిధి) ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఏపీ ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో చంద్రబాబు నేతృత్వంలోని మూడు పార్టీల కూటమి ప్రభుత్వం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు అతిరథ మహారథుల సమక్షంలో కొత్త పాలకుల ప్రమాణస్వీకారం పూర్తయింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పాటు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పవన్ డిప్యూటీ సీఎం హోదాను దక్కించుకోవడం ఖాయం. ప్రమాణం చేసిన 24 మంది రేపటి నుంచి తమ విధుల్లోకి వెళ్ళనున్నారు. కొత్త పాలన ప్రారంభించనున్నారు. జనసేన తరపున ముగ్గురు, బిజెపి తరపున ఒక్కరు ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన 17 మందికి ఛాన్స్ ఇచ్చారు. ఈసారి మంత్రివర్గంలో కనిపిస్తున్నది యువ రక్తమే. అందుకే ప్రమాణ స్వీకారం సైతం ఉత్సాహంగా సాగిపోయింది.ఈ ఎన్నికల్లో కూటమి 164 స్థానాల్లో విజయం సాధించడంతో క్యాబినెట్ కూర్పు కూడా అతి కష్టంగా మారింది. సామాజిక సమీకరణలు, అంతకుమించిఆ రెండు పార్టీలకు నాలుగు మంత్రి పదవులు కేటాయించాల్సి రావడంతో చంద్రబాబుకు కత్తి మీద సాముగా మారింది. అందుకే హేమా హేమీలైన సీనియర్లను పక్కన పెట్టి మరి కొత్తవారికి అవకాశం ఇచ్చారు చంద్రబాబు. సహజంగానే అసంతృప్తులు ఉంటాయి. కానీ అవేవీ బయటపడకుండానే ప్రమాణ స్వీకారం సాఫీగా జరిగిపోయింది. చంద్రబాబు,పవన్, లోకేష్ ప్రమాణం చేస్తున్నప్పుడు సభా వేదిక దద్దరిల్లిపోయింది. ఊహించిన దానికంటే పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఇక మెగా కుటుంబమంతా తరలివచ్చింది. పార్టీల ముఖ్య నేతలు, ఇతరులతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. ఏపీ స్టామినాను ఈ విజయం తేల్చి చెప్పింది. గత రెండు ఎన్నికల్లో ఏపీకి రాని అదృష్టం ఈసారి తలుపు తట్టింది. 2014 ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ఏకపక్ష విజయం దక్కించుకుంది. అప్పట్లో టిడిపికి వచ్చిన ఎంపీ స్థానాలు అక్కరకు రాలేదు. అందుకే విభజన హామీలకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. పోనీ 2019 ఎన్నికల్లో వైసీపీకి ఏకపక్ష విజయం దక్కింది. అప్పుడు కూడా ఏపీ సాయం కేంద్రానికి అక్కరకు రాలేదు. అప్పుడు కూడా విభజన హామీల కంటే జగన్ స్వప్రయోజనాలకి ప్రాధాన్యం దక్కింది. కానీ 2024 ఎన్నికల్లో దేశ ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారు. బిజెపికి సొంతంగా మెజారిటీ దక్కలేదు. ఎన్డీఏ కూటమిపరంగా అధికారంలోకి రాగలిగారు. అది కూడా టిడిపి సాయంతోనే. అందుకే ఏపీకి ఇంత వైభవం వచ్చింది. ఎన్నడూ ఏపీ ముఖం చూడని జాతీయ నేతలంతా రాష్ట్రానికి క్యూ కట్టారు. ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఒక విధంగా చెప్పాలంటే ఏపీకి ఇది మహర్దశ. అందుకే విభజన హామీలతో పాటు అపరిష్కృత సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. కానీ ఈ విషయంలో చంద్ర బాబు తో పాటు పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి ఎంతవరకు ఉంది అన్నది తెలియాల్సి ఉంది. గత పది సంవత్సరాల కంటే భిన్నంగా ఏపీకి న్యాయం జరిగితే రాజకీయంగా వైసిపి, కాంగ్రెస్ తో పాటు ఇతర పక్షాలు రాజకీయ సమాధి అయినట్టే.

# పవన్ సలహాలపై చర్చ

గుంటూరు, జూన్ 13, పవర్స్టార్ పవన్కల్యాణ్.. వెండితెరపై జనసేనానికి ఉన్న పేరు ఇది. అయితే ఇప్పుడా హీరోను రియల్ హీరో చేశారు ప్రజలు. తన చేతికి నిజమైన పవర్ను అందించారు. మరి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లో పవన్ తన పవర్ను ఎలా ఉపయోగించబోతున్నారు. పగలు, ప్రతికార రాజకీయాలకు కేరాఫ్ అయిన ఏపీ పాలిటిక్స్లో.. పవన్ మార్పు తీసుకొస్తారా? దీనికి ఆయన చేస్తున్న ప్రయత్నం ఏంటి?ఒకసారి చేస్తే తప్పు.. పదే పదే జరిగితే అది అలవాటు.. రాజకీయాల్లో ఇదే జరుగుతుంది అంటారు. వాళ్లు కాకపోతే వీళ్లు.. వీళ్లు కాకపోతే ఇంకొకరు. పాలించేవారు మారుతారు. బట్ పాలించే విధానం మాత్రం మారదు. ఇదే ఏపీ పాలిటిక్స్ గురించి కాస్త తెలిసిన వారు ఎవరైనా చెప్పే మాట.. కానీ ఇకపై అలా ఎవ్వరూ అనుకునే అవకాశం ఇవ్వొద్దు అంటున్నారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.. ప్రజలకు నిజమైన పాలన అంటే ఏమిటో పరిచయం చేద్దామంటున్నారు. అధికారాన్ని కక్షసాధింపుల కోసం కాకుండా.. ప్రజాభివృద్ధి కోసం వాడండి అంటూ చెబుతున్నారు. తాను అదే ఫాలో అవుతానని.. మీరు కూడా అదే ఫాలో అవ్వండి అంటూ తన పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు.ఏపీలో ఎన్డీఏ కూటమిది అఖండ విజయం.. అందులో జనసేనది అత్యద్భుత విజయం..పోటీ చేసిన 21 సీట్లలో 21 సీట్లను కైవసం చేసుకుంది. సో ఈ గెలుపును ప్రజలకు మనపై ఉన్న నమ్మకంగా చూడాలి. అంతేకాని గెలిపించారు కదా అని ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తా అంటే కుదరదు అంటున్నారు పవన్.. మనం చేసిన తప్పులను సరిదిద్దుకోవాలి. ఇతరులు చేసిన తప్పుల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. ఇదే చేస్తానంటున్నారు పవన్.. ఎందుకంటే ప్రజలకు అన్నీ తెలుసు. అధికారాన్ని ఇవ్వడమూ తెలుసు. ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం సద్వినియోగం చేయకపోతే..ఆ అధికారాన్ని లాక్కోవడం కూడా తెలుసు. వైసీపీ అధినేత జగన్ విషయంలో అదే జరిగింది. మరి ఈ తప్పుల నుంచి మనం పాఠాలు నేర్చుకోకపోతే ఎలా? అంటున్నారు పవన్.నిజానికి పవన్ మాట్లాడేది చాలా బాగుంది. ఇది ఆచరణలో జరిగితే అంతకంటే బాగుంటుంది. నిజంగానే ఏపీ పాలిటిక్స్లో మాత్రమే కాదు. నేషనల్ పాలిటిక్స్లో ఓ కొత్త ట్రెండ్ను పవన్ ప్రారంభించినట్టే.. కానీ పవన్ మాటలు ఆచరణలో సాధ్యమవుతుందా? అంటే అవుతుంది.. బట్ ఆయన ఎమ్మెల్యేలు ఫాలో అవుతారా? లేదా? అనేదే క్వశ్చన్.. ఎమ్మెల్యేలంతా ఆచరణలో దీన్ని చూపిస్తే మాత్రం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అతిపెద్ద మార్పు మొదలైనట్లే.కానీ ఒకటి మాత్రం నిజం.. పవన్ ఆవేశంగా కాదు.. ఆలోచనతో ముందుకు వెళ్లాలనుకుంటున్నారు. వైసీపీ వ్యతిరేక అజెండాతో కాదు.. ప్రజాభివృద్ధే ఎజెండాగా ముందుకు వెళ్లాలనుకుంటున్నారు. మనం కూటమిలో ఉన్నాం కాబట్టి.. కాబట్టి సర్దుకుపోవాల్సి ఉంటుందని ముందుగానే సూచిస్తున్నారు. సో నేల విడిచి సాము చేసే ఉద్దేశం ఆయనలో కనిపించడం లేదు. సంతోషం.. ఆయన థాట్స్ క్లియర్గానే ఉన్నట్టు కనిపిస్తుంది. మరి ఆయనను ఫాలో అయ్యేవారు కూడా ఇదే బాటలో నడిస్తే మంచిది. లేదంటే.. డైలాగ్స్ను డైలాగ్స్లానే ఉండిపోతాయి.

# యనమల లేని ఫస్ట్ కేబినెట్



కాకినాడ, జూన్ 13, (ఆంధ్రరేఖ. ప్రతినిధి) చంద్రబాబు నాయుడు ఈసారి కేబినెట్ లో సీనియర్ నేతలకు మొండి చేయి చూపించారు. సీనియర్ నేతలు ఎవరినీ ఈసారి పరిగణనలోకి తీసుకోలేదు. యనమల రామకృష్ణుడు నుంచి మొదలు పెడితే... అమర్నాథ్ రెడ్డి వరకూ ఎవరికీ తన మంత్రివర్గంలో ఛాన్స్ ఇవ్వలేదు. తెలుగుదేశం పార్టీలోకి యువరక్తం ఎక్కించాలన్న ఉద్దేశ్యంతోనే చంద్రబాబు ఈ రకమైన నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకంటే భవిష్యత్ లో ఎలాంటి రాజకీయ పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చంద్రబాబు ముందు జాగ్రత్త చర్యగా ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు సామాజికవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కనపడుతుంది. ముఖ్యంగా యనమల రామకృష్ణుడు లేని చంద్రబాబు కేబినెట్ ఇదే మొదటిది అని చెప్పాలి. ఎందుకంటే చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా యనమల రామకృష్ణుడు ఖచ్చితంగా మంత్రిగా ఉంటారు. ప్రాధాన్యత కలిగిన శాఖనే ఆయనకు అప్పగించే వారు. శాసనసభ వ్యవహారాలతో పాటు ఆర్థిక శాఖ వంటివి యనమల రామకృష్ణుడుకు అప్పగించి చంద్రబాబు చాలా వరకూ రిలీఫ్ ఫీలవుతారు. ఇప్పుడు శాసనమండలిలో యనమల రామకృష్ణుడు సభ్యుడుగా ఉన్నారు. ఆయనను కేబినెట్ లోకి తీసుకోలేదంటే నిజంగా తెలుగుదేశం పార్టీ లోని నేతలకు మాత్రమే కాదు క్యాడర్ కు కూడా అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. యనమల రామకృష్ణుడు స్థానంలో కొలుసు పార్థసారధికి ఆ సామాజికవర్గం నుంచి చోటు కల్పించారు. బీజేపీ నుంచి మంత్రి అయిన సత్యకుమార్ ది కూడా అదే కమ్యునిటీ.అంటే చంద్రబాబుకు సూదూర ఆలోచన చేసి ఉంటారన్నది తెలుగుదేశం పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఎప్పుడూ పాతమొహాల వల్ల ప్రజలు కూడా విసి?గిపోయి ఉన్నారని, అందుకే మంత్రివర్గంలో కొత్త వారికి చోటు కల్పించేందుకు ఆయన ధైర్యంగా ఒక అడుగు ముందుకు వేశారనే చెప్పాలి. ఎందుకంటే యనమల రామకృష్ణుడును పక్కన పెట్టడమే ఇందుకు ఉదాహరణ. ఆయన కుటుంబంలో కుమార్తెతో పాటు వియ్యంకుడు, అల్లుడికి కూడా టిక్కెట్లు కేటాయించి ప్రాధాన్యత కల్పించినప్పటికీ మంత్రివర్గంలో యనమలకు మాత్రం స్థానం కల్పించకపోవడానికి ఇదొక కారణంగా చెబుతున్నారు అదే సమయంలో మరికొందరు సీనియర్లను కూడా చంద్రబాబు నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టినట్లే కనిపిస్తుంది. అందుకు కారణాలు బయటకు కనిపిస్తున్నవి కాకపోయినా లోలోపల మరికొన్ని ఉన్నాయని అనుకుంటున్నారు తెలుగు తమ్ముళ్లు.. పార్టీకి సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న వాళ్లను కూడా మంత్రివర్గంలోకి పరిగణనలోకి తీసుకోలేదు. ధూళిపాళ్ల నరేంద్రకు మరోసారి రాజకీయంగా ఇబ్బంది ఎదురయింది. ఈసారి కూడా నరేంద్రకు కేబినెట్ లో స్థానం దక్కలేదు. అదే సమయంలో యరపతినేని రాజేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావు వంటి వారిని కూడా పక్కన పెట్టారంటే చంద్రబాబు ఆలోచనలు ఏమై ఉంటాయన్నది మాత్రం అనుచరులు తలలు పట్టుకుంటున్నారు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచన చేస్తే తలలు బొప్పి కడుతున్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు ముఖ్యంగా పరిటాల సునీతను కూడా పక్కన పెట్టారంటే చంద్రబాబు ఈసారి కొత్త తరహా ఆలోచనలో ముందుకు వెళుతున్నారని చెప్పకనే తెలుస్తోంది. అలెక్సా... ఏం జరిగిందో నువ్వైనా చెప్పవూ...

# ఇంకో మంత్రి పదవి భర్తీ ఎప్పుడు

విజయవాడ, జూన్ 13, (ఆంధ్రరేఖ. ప్రతినిధి)ఆంధ్రప్రదేశ్ లో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. చంద్రబాబుతో పాటు నలుగురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. మరో మంత్రి పదవి ఖాళీగా ఉంది.కొణతాల రామకృష్ణ సీనియర్ నేత. ఆయనకు చంద్రబాబు కేబినెట్ లో మంత్రి పదవి గ్యారంటీ అనుకున్నారు. విశాఖ జిల్లా నుంచి వంగలపూడి అనిత ఒక్కరే మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. విశాఖ లాంటి జిల్లాకు ఒక్కరే మంత్రి పదవి అని ఎవరూ ఊహించని విషయం. అయితే అదే సమయంలో విశాఖ జిల్లాలో సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ ఇలా అనేక మంది నేతలు కూటమి నుంచి విజయం సాధించి ఉన్నారు. అందులో మహిళ, ఎస్సీ కోటాలో ఒక్క వంగలపూడి అనిత ఒక్కరికే మంత్రి పదవి దక్కింది చంద్రబాబుతో పాటు ఇరవై నాలుగు మంది మంత్రులు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. మరొక మంత్రి పదవి చంద్రబాబు కేబినెట్ లో ఖాళీగా ఉంది. ఈరోజు మంత్రి వర్గ ప్రమాణ స్వీకారంలో జనసేన నుంచి ముగ్గురు మాత్రమే ఉన్నారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ లు మాత్రమే స్థానం సంపాదించుకున్నారు. జనసేన తొలి నుంచి నాలుగు మంత్రి పదవులను కోరుతుంది. అయితే మూడు మంత్రి పదవులు మాత్రమే దక్కాయి.

# కూరగాయల ధరలకు రెక్కలు..



రాజమండ్రి, జూన్ 13,తూర్పుగోదావరి జిల్లాల్లో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరల మంటకు సామాన్యుల కల్లల్లో నీరు తిరుగుతుంది. అమాంతం పెరిగిన నిత్యావసర వస్తువులను ధరలను చూసి సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఇటీవలి కురిసిన అకాల వర్షాల వల్లే కూరగాయల ధలకు రెక్కలు వచ్చాయని రైతులు, విక్రయదారులు పేర్కొంటున్నారు. కూరగాయలు, ఇతర వంట సరుకుల ధరలు సామాన్యుని వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ఏం కొనేటట్టు లేదు...ఏం తినేటట్టు లేదు అన్న పరిస్థితి నెలకొంది. వారం రోజుల్లోనే రిటైల్ మార్కెట్లో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్నింటి ధరలు మూడు, నాలుగు రెట్లు కూడా పెరిగాయి.వారం క్రితం వరకూ కిలో టమాటా రూ.20 ఉండగా, ప్రస్తుతం అది మూడింతలు పెరిగి రూ.60కు చేరింది. పచ్చిమిర్చిని ముట్టుకుంటే ధర ఘాటు పుట్టిస్తోంది. వారం రోజుల క్రితం కిలో పచ్చిమిర్చి రూ.60 ఉండగా, ప్రస్తుతం అది రూ.100కు చేరింది. కేజీ ఉల్లి ధర గత వారం రూ.22 ఉండగా, ప్రస్తుతం అది రూ.50కి చేరింది. కేజీ చిక్కుళ్లు ధర గత వారం రూ.40 ఉండగా, ఇప్పుడది రూ.120కి చేరింది. క్యాప్సికమ్ కేజీ రూ.60 నుంచి రూ.100కు పెరిగింది. బీరకాయ ధర గత వారంలో కేజీ రూ.60 ఉండగా, ప్రస్తుతం రూ.100కి చేరింది.కాయగూర ధరలే కాకుండా ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. అన్ని రకాల ఆకు కూరలు రూ.20కు మూడు కట్టలు ఇచ్చేవారు. ప్రస్తుతం రెండు కట్టలే ఇస్తున్నారు. కొత్తిమీర రూ.10కి దొరికేది, ఇప్పుడది రూ.40కి చేరింది. అల్లం ధర సామాన్యునికి అందనంత ఎత్తుకు పోయింది. పది రోజుల క్రితమే కేజీ అల్లం రూ.80 ఉండగా, ఇప్పుడది రూ. 280కి చేరింది. దీంతో అల్లం కొనడానికి సామాన్యులు వెనకడుగు వేస్తున్నారు. అయితే కాయగూర, ఆకు కూరల ధరలు పెరగడానికి అకాల వర్షాలే కారణమని చెబుతున్నారు. అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లిందని, అందువల్ల కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. దీనివల్ల వంట చేతికి రాక, మార్కెట్లోకి వెళ్లక ధరలు పెరిగాయని చెబుతున్నారు. విక్రయదారులు కూడా అకాల వర్షాలనే ధరలు పెరగడానికి కారణంగా చెబుతున్నారు అలాగే చికెన్, మటన్, గుడ్లు ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో చికెన్ రూ. 250 పలుకుతుంది. ముప్పై గుడ్ల ట్రే రూ.170 నుంచి రూ.190 పలుకు తు ంది. అలాగే మటన్, చేపలు, రొయ్య ల వంటి ధరలు కూడా భారీగా పెరిగా యి. మటన్ కేజీ రూ.1,000కు చేరింది. కిరాణా సరుకుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఈ ధరలు సామాన్యుడికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. నెల రోజుల క్రితం వంద గ్రాముల జీలకర్ర ధర రూ.40 ఉండగా, ఇప్పుడు అది రూ.80 చేరింది.

## ప్రజా సంక్షేమ పాలన అందించడమే కూటమి లక్ష్యం

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ప్రొద్దుటూరు అసెంబ్లీ టిడిపి పరిశీలకుడు ఏ వి ఆర్ ప్రసాద్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 13.: ప్రజా సంక్షేమ పాలన అందించడమే కూటమి లక్ష్యం అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ప్రొద్దుటూరు అసెంబ్లీ టిడిపి పరిశీలకుడు ఏ వి ఆర్ ప్రసాద్ అన్నారు. విజయవాడలో ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ నజీర్ అధ్యక్షతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 24 మంది మం త్రులుగా ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసం గా జరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఏవిఆర్ ప్రసాద్ టిడిపి యువ నాయకుడు, ప్రజా గళం రూపకర్త నారా లోకేష్, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నంద్యాలకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ఎన్ఎండి ఫరూక్, నిడదవోలు నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్,ప్రొద్దుటూరు టిడిపి ఎమ్మెల్యే ఎన్ వరదరాజుల రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్ కొండారెడ్డి తదితర ముఖ్య నాయకులను కలిసి వారికి అభినందనలు తెలిపారు . చంద్రబాబు ముఖ్యమంత్రిగా గురువారం సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీ, రెండవ సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట రద్దు పై చేయడం తదితర 5 ఫైళ్లపై సంతకం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే ధ్యేయంగా, ప్రజా సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఏవిఆర్ ప్రసాద్ పేర్కొన్నారు

## మంత్రి ఫరూక్ ను అభినందిస్తున్న నంద్యాల ప్రముఖులు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 13-: ఎన్ఎండీ ఫరూక్ మంత్రిగా బుధ వారం ప్రమాణస్వీకారం చేయడంతో పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. మాజీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఏవి సుబ్బారెడ్డి. 12వార్డు కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్ , యోగా గురువు ఆనంద్ గురూజీ, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు బింగుమళ్ల శ్యామసుందర్ గుప్త, నంద్యాల కూరగాయల మార్కెట్ వ్యాపారి లక్కబోయిన ప్రసాద్. మంత్రిని కలిసి అభినందించారు.

## హోల్ సేల్ దుకాణాల పై ఆకస్మిక తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 13 - జిల్లా వ్యవసాయ అధికారి వై. వి.మురళీ కృష్ణ నంద్యాల పట్టణంలో హోల్ సేల్ ఎరువుల దుకాణాల యందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారుశ్రీ వెంకట శివ సాయి ఫర్టీలైసర్స్ యందు ఎరువుల నిలువలు,స్టాక్ బుక్ రిజిస్టర్స్ ,బిల్ బుక్స్,మరియు ఇతర ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. రిజిస్టర్ నిర్వహణలో పలు సూచనలు చేశారు . జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ హోల్ సేల్ ఎరువు దుకాణం యజమానులు రిటైల్ డీలర్లకు మరియు రైతులకు ఎరువుల కొరత రాకుండా సక్రమంగా సరఫరా చెయ్యాలన్నారు రిజిస్టర్ మరియు గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేట్లు చూసుకోవాలని , స్టాక్ రిజిస్టర్ లు గోడౌన్ ప్రకారం మరియు గ్రేడ్ ప్రకారం నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదనీ,రైతులకు కావల్సిన ఎరువులు మాత్రమే విక్రయించాలని తెలిపారు.డీలర్లు అందరూ ఫ్సీఓ1985కి అనుగుణంగా ఎరువుల వ్యాపారం చేసుకోవాలని లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.ఈతనిఖీలోసహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ .మండలవ్యవసాయ అధికారి ప్రసాద రావు. సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై అవగాహన సదస్సులు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 13 :. గురువారం నంద్యాల గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మరియు నంద్యాల గవర్నమెంట్ మెడికల్ కాలేజీ నందు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో మూడు రోజుల క్యాన్సర్ కేర్ హాండ్స్ ఆన్ అవగాహన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ మాట్లాడుతూ, జిల్లాలోని 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుందని, ముఖ్యంగా మూడు రకాల అనగా దంత, రొమ్ము మరియు గర్భాశయ ముఖ క్యాన్సర్లను గుర్తించడానికి పరీక్షలు ఏ విధంగా నిర్వహించాలి అనేటువంటి విషయాల పైన అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం విలేజ్ స్థాయిలో ఉన్నటువంటి విలేజ్ హెల్త్ క్లినిక్ స్థాయిలో పనిచేస్తున్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, పట్టణ ఆరోగ్య కేంద్ర ఆరోగ్య కార్యకర్తలకు మరియు మెడికల్ ఆఫీసర్లకు ఈ సందర్భంగా ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ఎన్సిడి- జిల్లా నిర్వహణ అధికారి డాక్టర్ కాంతరావు నాయక్ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం నంద్యాల జిల్లాలోని నంద్యాలలో 2 చోట్ల మరియు బనగానపల్లె ఏరియా హాస్పిటల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ హాస్పిటల్స్ సూపరిడెంట్ డాక్టర్ వి ఎం వి ఆర్ వి ప్రసాద్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కళావతి, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్యాం బాబుకు మంత్రి పదవి ఇవ్వాలి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 13 పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుకి మంత్రి పదవి ఇవ్వాలి జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు డిమాండ్ చేశా రు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంద్యాల జిల్లాలో బీసీ కులాలకుఒక ఎమ్మెల్యే సీటు కూడా తెలుగు దేశం పార్టీ కేటాయించలేదు బిసి కులాలకు రక్షణ చట్టం చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో తెలియజేశారు అయితే నంద్యాల జిల్లాలో బీసీ కులాలకు ఒక ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించలేదు అదేవిధంగా ప్రస్తుతం మంత్రి వర్గ విస్తరణలో నంద్యాల కర్నూలు జిల్లాలకు ఒక మంత్రి పదవి కూడా బీసీ కులాలకుఇవ్వలేదు కర్నూలు జిల్లాలో మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుమారుడు శ్యాంబాబు పత్తికొండ నియోజకవర్గం నుండి 13వేల మెజార్టీతో గెలుపొందడం జరిగినది కర్నూలు ఉమ్మడి జిల్లాలలో దాదాపు 40 సంవత్సరాల నుండి రాజకీయ జీవితాన్ని గడిపిన కేఈ కుటుంబానికి మంత్రి పదవి దక్కకపోవడం దురదృష్టకరం కర్నూలు ఉమ్మడి జిల్లాలలో అగ్రకులాలకు చెందిన ఎన్ఎండి ఫరూక్ బీసీ జనార్దన్ రెడ్డి టీజీ భరత్ ముగ్గురు అగ్రకులాల నాయకులకు మంత్రి పదవులు ఇచ్చారు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా ఉన్న కేఈ కుటుంబానికి మంత్రి పదవికి ఎంపిక చేయకపోవడం దురదృష్టకరమని ప్రస్తుతం ఒక మంత్రి పదవిని రిజర్వు చేశారని పత్రికల ద్వారా తెలిసినది కావున వెంటనే నారా చంద్రబాబునాయుడు మంత్రి పదవిని ఇస్తే కర్నూలు ఉమ్మడి జిల్లాలలో బీసీలకు సామాజిక న్యాయం జరిగినట్లు అవుతుంది కావున నారా చంద్రబాబు నాయుడు మా బీసీ సంక్షేమ సంఘం యొక్క అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని బీసీలకు ఎమ్మెల్యే పదవి ఇస్తే అసెంబ్లీలో కేఈ శ్యాంబాబు బీసీల వాణి వినిపించడానికి అవకాశం కల్పించిన వారు అవుతారని ఈ సందర్భంగా బీసీ కుల సంఘాల నాయకులు అందరూ కలిసి మా కుమ్మడిగా కె ఈ శ్యాంబాబుకి సంఘీభావం తెలియజేశారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

## విజయసాయిరెడ్డి పై టిడిపి బుద్దా వెంకన్న ఫైర్



విజయవాడ,వైకాపా నేత విజయ సాయి రెడ్డిపై టీడీపీ నేత బుద్దా వెంకన్న మడిపడ్డారు.వైసిపిలో మంత్రులు, ఎమ్మెల్యే లు బూతులు తిడితే జగన్, విజయసాయి రెడ్డికి కనిపించలేదా. కొడాలి నాని, వంశీ అనే పిల్లల తాటాకు చప్పుళ్లకు మీరు మురిసి పోయారు. లోకేష్ జూమ్ మీటింగ్ లోకి వస్తే వాళ్లకి తప్పు అని చెప్పలేదేదాడులు చేయవద్దని మా నాయకులు ముందే చెప్పారు. ఎక్కడో ఏదో ఒక ఘటన జరిగితే విజయసాయి రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారు. ఈ ఐదేళ్లల్లో నువ్వు, మీ జగన్ మీ వాళ్ల నోళ్లు ఎందుకు అదుపు చేయలేదు. ప్రభుత్వం పోగానే పిల్లి అరుపులు అరుస్తున్నారు. విజయసాయి రెడ్డి ఒక లుచ్చా.. ఉత్తరాంధ్ర దోచేశాడు. వీటి పై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. నిజంగా మేము దాడులు చేయాలని అనుకుంటే... ఇలా ఉంటుందా పరిస్థితి. కక్ష సాధింపు రాజకీయాలు వద్దని మా అధినేత ప్రకటించారు. జగన్ ఎప్పుడైనా ఇలా ఒక్క ప్రకటన చేశాడా. చంద్రబాబు ప్రమాణ స్వీకారం అద్భుతంగా జరిగింది. దానిని డైవర్ట్ చేయడానికే విజయసాయి రెడ్డి ప్రెస్ మీట్ పెట్టాడు. సింహాలు, పులులు అన్న వాళ్లు... అధికారం పోగానే పిల్లులు అయిపోయారా. టిడిపి కార్యాలయం పై దాడి చేసిన దేవినేని అవినాష్ కి గన్ మెన్లు ఇచ్చారు. బూతులు తిట్టే నానిలకయ,వంశీకి భద్రత పెంచింది మీరు. వల్లభనేని వంశీ మాత్రం మాట్లాడకూడని మాటలు మాట్లాడాడు. వాడిని మాత్రం వదిలే ప్రసక్తే లేదు.. శిక్ష పడాల్సిందేనని అన్నారు.ా వంశీ తో నాకు ఫోన్ చేయించండి ... నేను వాడితో మాట్లాడతా. అధికార మదంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇంట్లోవాళ్లను తిట్టించారు. అప్పుడు మీకు వాళ్ల బాధ తెలియలేదా... చట్టాలు గుర్తు రాలేదా. ముసలి నక్కా... నువ్వు ఇంకా నక్క వేషాలు మాను. ఈ ఐదేళ్లల్లో మేము ధైర్యం గా పోరాడి నిలబడ్డాం. మా చంద్రబాబు సవాల్ చేసి, సిఎం అయ్యాక అసెంబ్లీ లో అడుగు పెడుతున్నారు. మీ అవినీతి, అక్రమాల పై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. చంద్రబాబు కు ప్రతిపక్ష పాత్ర అయినా వచ్చింది... జగన్ కు అదీలేదు. మీకు సిగ్గు, శరం ఉంటే... వైసిపి ని పూర్తిగా రద్దు చేయండి. విజయసాయి రెడ్డి నీ మాయ మాటలు ఎవ్వరూ నమ్మరు. నువ్వు ముసలి నక్కవి, శకునివి... వదిలేది లేదు. వంశీని పిలిపించి పక్కన కూర్చో పెట్టుకుని ప్రెస్ మీట్ పెట్టు. మీ ఆగలడాలను ఐదేళు భరించాం... కేసులకు భయపడకుండా పోరాటాలు చేశాం. ఐదు రోజుల్లోనే ఫిర్యాదు లు అంటూ హడావుడి చేస్తున్నారు. అధికార మదంతో అడ్డగోలుగా వాగిన వారు తప్పకుండా శిక్ష అనుభవించాలని అన్నారు.


## సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్లు

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 13- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం సంతకాలు చేయనున్న నేపథ్యంలో పట్టణంలో ఉన్న మూడు చోట్ల అన్న క్యాంటిన్ల ను గురువారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పరిశీలించారు ఆయనమాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో ఉన్నబస్టాండు దురుగా ఉన్న అన్న క్యాంటీన్ . గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద ఎన్టీఆర్ కాంప్లెక్స్. యందు పరిశీలన చేసి చిన్న చిన్న మరమ్మతులనేపథ్యంలోఇంజనీరింగ్ అధికారులకు శానిటేషన్ విభాగం అధికారులకు తగు సూచనలు జారీ చేశారు . ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ వెంటమున్సిపల్ఎమ్ఈఈరమణ మూర్తి. డీఈలు జయబారత్‌రెడ్డి. మదు కుమార్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినా రాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దొడ్డు బియ్యం దారి మళ్లుతోంది....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 13 పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. పట్టణంలో దళారులు సిండికేట్ గా మారి నల్ల బజారుకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ కింద అందజేసే దొడ్డు బియ్యం తినడానికి చాలామంది వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఇలాంటి వారి నుంచి దళారులు కిలో 20 రూపాయలు చొప్పున చెల్లించి బియ్యాన్ని తీసుకుంటున్నారు. వాటిని బడా వ్యాపారులకు విక్రయిస్తూ అక్రమార్జ నకు తెర తీస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఉచితంగా ఒక్కో వ్యక్తికి ఐదు కిలోల చొప్పున అందజేస్తున్నారు. బియ్యం దందా చేస్తున్న వారిపై పట్టణంలో కొన్ని బియ్యం మిల్లులు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారు. బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు చేరవేసే వారిపై పర్యవేక్షణ కొరవబడింది.

## జగన్ పై ఇక నో కామెంట్స్...

విజయవాడ, జూన్ 13,మాజీ ఎంపీ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తాను జగన్ గురించి వ్యక్తిగతంగా మాట్లాడబోనని ప్రకటించారు. భీమవరంలో మీడియా సమావేశంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ రెబల్ ఎంపీగా మారినప్పటి నుండి రఘురామకృష్ణరాజు ప్రతీ రోజూ రచ్చబండ పేరుతో ప్రెస్ మీట్ పెట్టి జగన్ పై విమర్శలు గుప్పించేవారు. ఇప్పుడు హఠాత్తుగా ఇకపై జగన్ గురించి మాట్లాడబోనని ఆయన ప్రకటించడం ఆశ్చర్యకరంగా మారింది. అయితే దీనికి ఆయన తన వివరణ ఇచ్చారు. జగన్ మా మంచో చెడో చేయాల్సింది చేశాడు వెళ్లిపోయాడని ఇప్పుడు ప్రజలు ఆ విషయం పట్టించుకోరన్నారు. ప్రజల దృష్టి ఇప్పుడు టీడీపీ పాలనపై ఉంటుందన్నారు. హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుకుంటారని అందుకే మేం కూడా మా హామీలను అమలు చేసే విషయంపైనే దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. జగన్ పై కానీ, వైసీపీ పైన కానీ ప్రజల దృష్టి ఉండదన్నారు. తాను మళ్లీ విమర్శలు చేస్తే ప్రజల దృష్టి అటు మళ్లుతుందని.. అలా ఉండకూడదు రఘురామ స్పష్టం చేశారు. ప్రజలు మనకు అధికారం ఇవ్వలేదు, బాధ్యతను కట్టబెట్టారని చంద్రబాబు చెప్పారని రఘురామ గుర్తు చేసుకున్నారు. టీడీపీ నేతలు దాడులు శిక్షించాలన్నాం"ని చంద్రబాబు చెప్పారని రఘురామ అన్నారు. అందుకే తనపై జరిగిన కస్టోడియల్ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఆసుపత్రి నివేదిక ప్రకారం తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని స్పష్టంగా తెలుస్తోందని చెప్పారు. అలాంటిది నాను నేనే న్యాయం చేసుకోకుంటే సామాన్యులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం పోతుందని దీనిని దృష్టిలో ఉంచుకునే పోలీసులకు ఫిర్యాదు చేశానని గుర్తు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాను ఎవరితోనూ మాట్లాడలేదని, ఎవరి సూచనల మేరకో తాను ఫిర్యాదు చేయలేదన్నారు. ఏపీలో హింస జరుగుతోందని వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను కూడా రఘురామ కొట్టి పడేశారు. ఇద్దరు వ్యక్తలు కొట్టుకుంటే దెబ్బతిన్న వ్యక్తికి వైసీపీ ముసుగేసి చంపేస్తూన్నారని హడావిడి చేస్తున్నారని విమర్శించారు. పందాలు కాసిన వాళ్ళు కొంతమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని.. దానిని వైసీపీ ప్రభుత్వం రాలేదని చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ ఆత్మహత్యలకు జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర 2.0 స్టార్ట్ చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**